

ఆయుర్వేద వైద్యుడి ఔదార్యం

వరదల వేళ చింతూరుకు చెందిన ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. 8లో



10,707 మంది డ్రాపౌట్ల గుర్తింపు

జిల్లాలో 10,707 మంది డ్రాపౌట్లను గుర్తించామని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు వెల్లడించారు. 8లో



రక్తహీనతతో విద్యార్థి మృతి

రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థి లాజరస్ అరకు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. 8లో

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో కురుస్తున్న వర్షాలు ఇంకా తగ్గుముఖం పట్టనందున, గురువారం కూడా అన్ని యాజమాన్య విద్యా సంస్థలకు కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ సెలవు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు సెలవు అమలుచేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులను తల్లిదండ్రులు బయటకు పంపించవద్దని, ప్రజలు గెడ్డలు, వాగులు దాటే సాహసం చేయవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని పేర్కొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అతిథి అధ్యాపక పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ కె.భరత్‌కుమార్ నాయక్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.. కళాశాలలోని తెలుగు, ఇంగ్లీషు, కామర్స్, బోటనీ, లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్ సబ్జెక్టులకు సంబంధించి, అర్హులైన అభ్యర్థులు ఈనెల 27వ తేదీ సాయంత్రం లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.


జాయింట్ కలెక్టర్ పునరావాస కేంద్రాల సందర్శన



గన్నవరం పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ్

ఎటపాక: గోదావరి వరద ముంపు ప్రాంత ప్రజల పునరావాస కేంద్రాలను బుధవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్ సందర్శించారు. దీనిలో భాగంగా ఆయన సీతాపురం జిల్లాపరిషత్ హైస్కూల్,గన్నవరం ప్రాథమిక పాఠశాల పునరావాస కేంద్రాల్లో బాధితులను పరామర్శించి వారికి అందుతున్న సహాయక చర్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లోని బాధితులకు బియ్యం,కందిపప్పు,కూరగాయలు,వంట నూనె ఇచ్చినట్టు చెప్పారు. అనంతరం బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట స్పెషల్ కలెక్టర్ మమ్మి, తహసీల్దార్ శేఖర్,ఎంపీడీవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కొనసాగుతున్నాయి.పాడేరు డివిజన్ వ్యాప్తంగా కుండపోతగా కురుస్తున్నాయి. రంపచోడవరం,చింతూరు డివిజన్లలో ఓమోస్తరుగా కురుస్తున్నాయి. పాడేరులో ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షానికి ప్రధాన రోడ్లన్ని నిర్మానుష్యంగా మారాయి. జిల్లాలో అత్యధికంగా ముంచంగిపుట్టు మండలంలో 224.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మారుమూల గ్రామాలకు పోయే రోడ్లలో ప్రధాన గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో రవాణా సంబంధాలు స్తంభించాయి.

జిల్లాలో 369.6మిల్లీమీటర్ల వర్షపాతం

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా 369.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.ముంచంగిపుట్టులో 224.6,పెదబయలులో 35.4, హుకుంపేటలో 17, డుంబ్రిగుడలో 15.2, పాడేరులో 14.6, చింతూరులో 9.8, జి.మాడుగులలో 8.4, అరకులోయలో 5.6, జి.కే.వీధిలో 4.8, మారేడుమిల్లిలో 3.2,అనంతగిరిలో 2.8,ఎటపాకలో 2,కూనవరంలో 1.8,వీఆర్.పురంలో 1.2, దేవీపట్నంలో 1.4,రంపచోడవరంలో 1.4, గంగవరంలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నెలకొంది.

పోలీసులు అప్రమత్తం



తనిఖీ చేస్తున్న పోలీసులు

వై.రామవరం: ఒకపక్క ఈనెల 28 నుంచి వచ్చే నెల 3 వరకు మావోయిస్టు వారోత్సవాలు, మరోపక్క సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా బుధవారం వై.రామవరం నుంచి అడ్డతీగల వెళ్లే ప్రధానరహదారిలో ఎస్‌ఐ ఎం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేశారు.



ముంపు గ్రామాలకు బోటులో వెళ్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ప్రత్యేకాధికారి సూరజ్ గనోరే



చింతూరు మండలం ఏజీకొడేరులో వరద బాధితులతో మాట్లాడుతున్న పీవో చైతన్య



వరద తగ్గుముఖం పట్టడంతో కూనవరం-వీఆర్‌పురం మండలాల మధ్య రాకపోకలు

గోదావరి.. శబరి శాంతించినా..
ఇంకా ముంపులోనే..

గోదావరి, శబరి నదుల వరద తగ్గుముఖం పట్టడంతో విలీన మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరద ప్రభావం నుంచి మాత్రం పూర్తిగా తేరుకోలేదు. ఎగపోటు వల్ల వాగుల నీరు ఇప్పటికీ రోడ్లపై నిలిచి ఉండటంతో చాలా గ్రామాల అంతర్గత రహదారులు ముంపులోనే ఉన్నాయి. ఆంధ్రా నుంచి తెలంగాణ, ఒడిశాకు రాకపోకలు ప్రారంభం కాలేదు.

- బయటపడని అంతర్గత రహదారులు
- చాలా గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- దిక్కుతోచని స్థితిలో వరద బాధితులు
- ఆంధ్రా నుంచి తెలంగాణ, ఒడిశాకు మార్గంలేక నిలిచిపోయిన వాహనాలు



చింతూరు మండలం చట్టి వద్ద ఆంధ్రా-తెలంగాణ జాతీయ రహదారి-30పై నిలిచిన వరదనీరు

చింతూరు: గత ఐదు రోజులుగా నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను బెంబేలెత్తించిన శబరినది ఎట్టకేలకు శాంతించింది. బుధవారం ఉదయం నుంచి వరద నెమ్మదిగా తగ్గుతోంది. అయితే నది ఉధృతికి ఎగపోటుకు గురైన వాగుల వరదనీరు ఇంకా రహదారులపైనే ఉంది.

- జాతీయ రహదారి-326, జాతీయ రహదారి-30పై వరదనీరు ఉన్నందున వరుసగా ఆరోరోజు కూడా ఆంధ్రా నుంచి తెలంగాణ, ఒడిశాకు రాకపోకలు నిలిచిపోయాయి. చంద్రవంక, సోకిలేరు, కుయిగూరు, జల్లివారిగూడెం, చీకటివాగులు ఉధృతిగానే ప్రవహిస్తున్నాయి. వీటి వరద నీరు రహదారులపై ఉండటంతో చింతూరు నుంచి కూనవరం, వీఆర్‌పురం మండలాలకు, చింతూరు మండలంలోని 35 గ్రామాలకు రాకపోకలు కొనసాగలేదు. చింతూరులో జరిగిన వారాంతపు సంత జనాలు లేక వెలవెలపోయింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో..

వరద బాధితులకు సహాయక కార్యక్రమాలు ముమ్మరం చేశామని స్థానిక ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. బుధవారం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ముకునూరు, ఏజీకొడేరులో బాధితులకు బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలు, ముకునూరులో అంగన్‌వాడీ కేంద్రానికి పాల ప్యాకెట్లు సరఫరా చేశామని తెలిపారు.

గోదారమ్మ తగ్గుముఖంతో..

ఎటపాక: గత నాలుగురోజులుగా గోదావరికి వచ్చిన వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక దాటి మంగళవారం ఉదయం 51.6 అడుగులకు చేరిన గోదావరి వరద నిలకడగా మారి మధ్యాహ్నం నుంచి తగ్గుముఖం పట్టింది. స్వల్పంగా తగ్గుతూ రాత్రికి 48 అడుగుల దిగువకు తగ్గడంతో రెండవ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. క్రమేమి తగ్గుతూ బుధవానం సాయంత్రానికి 45.2 అడుగులకు చేరింది. బుధవారం మధ్యాహ్నం భద్రాచలం నుంచి ఎటపాక మండలంలోని నందిగామ వరకు రహదారులు ముంపు నుంచి బయటపడటంతో రాకపోకలు కొనసాగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రా సరిహద్దు భద్రాచలం వద్ద రహదారికి అడ్డంగా పోసిన తాత్కాలిక మట్టి కట్టను సాయంత్రం తొలగించారు. దీంతో ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వాహనాల రాకపోకలు మొదలయ్యాయి. అయితే నెల్లిపాక నుంచి వీరాయిగూడెం ,గౌరిదేవిపేట నుండి నల్లకుంట వరకు ఉన్న రహదారి ఇంకా వరద ముంపులోనే ఉంది. కూనవరం ,ఎటపాక మండలాల సరిహద్దు పోలిపాక వద్ద రహదారిపై వరద నీరు ఉండటంతో కూనవరం వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది.

మళ్లీ స్వల్పంగా పెరిగే అవకాశం

నిలకడగా ఉన్న గోదావరి గురువారం ఉదయానికి స్వల్పంగా వరద పెరిగే అవకాశం ఉందని కేంద్ర జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

ఆరు అడుగులు తగ్గుదల..

వీఆర్‌పురం: గోదావరి, శబరి నదుల ఉధృతి తగ్గుముఖంతో వరద బాధితులకు కొంత ఉపశమనం కలిగింది. మంగళవారం రాత్రి నుంచి సుమారు 12 గంటల వ్యవధిలో 6 అడుగుల మేర నీటిమట్టం తగ్గింది. కూనవరం - వీఆర్‌పురం మండలాల మధ్య శబరి వంతెన వద్ద రహదారిపై చేరిన వరద నీరు తగ్గుముఖం పట్టడంతో రాకపోకలు మొదలయ్యాయి.

- చింతూరు మండలం వైపు ప్రధాన రహదారిని పలు గ్రామాల్లో వరదనీరు ముంచెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వీఆర్‌పురం మండలం జలదిగ్బంధానికి గురైంది. వడ్డిగూడెం ,శ్రీరామగిరి గ్రామాలను ఇంకా వరద నీరు చుట్టుముట్టే ఉంది. ఇప్పూరు-కొట్టూరిగొమ్ము, శ్రీరామగిరి-సీతంపేట, సీతంపేట-తోటపల్లి, వడ్డిగూడెం-వడ్డిగూడెం కాలనీ, ధర్మతాళ్లగూడెం-వీఆర్‌పురం, అన్నవరం-ఉమ్మిడివరం, కన్నాయిగూడెం-చింతరేగుపల్లి, తుష్టివారిగూడెం-ఏవీగూడెం, రామవరం-సోములగూడెం గ్రామాల మధ్యలోని వరదనీరు రహదారులపై ఉన్నందున రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అత్యవసర సేవలకు మర పడవలు ఏర్పాటు చేసి సహాయ కార్యక్రమాలు చేపట్టినట్టు తహసీల్దార్ సయ్యద్‌మౌలానాఫాజిల్ తెలిపారు.

బోట్‌పై పర్యటించిన కలెక్టర్

మండలంలోని వరద ముంపు ప్రభావిత గ్రామాల్లో కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం పర్యటించారు. శబరి బ్రిడ్జి వద్ద బోట్‌పై ముంపు గ్రామం జీడిగుప్ప చేరుకొని గుట్టపైన పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వరద బాధితులతో మాట్లాడారు. అందుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. అనంతరం ముకపల్లిలోని వరదబాధితులతో మాట్లాడి నిత్యావసర సరుకులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సూరజ్‌గనోరే, జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి,తహసీల్దార్ సయ్యద్‌మౌలానాఫాజిల్ ,సీఐ దానేటి రామారావు పాల్గొన్నారు.

కారులో బాలింత తరలింపు

వీఆర్‌పురం మండలం కల్తనూరుకు చెందిన సూట్రు లక్ష్మి అనే బాలింత రెండు నెలల బిడ్డతో చింతూరు మండలంలోని సోకిలేరు వాగులో పడవదాటి స్వగ్రామం వెళ్లేందుకు ప్రయత్నించడంపై పీవో స్పందించారు. వెంటనే ఆమెను తన కారులో చింతూరు ఏరియా ఆస్పత్రికి పంపించి వసతి సౌకర్యం కల్పించారు. వరదలు తగ్గిన వెంటనే పంపిస్తామని ఆమెకు భరోసా కల్పించారు.



బాలింతను తన కారులో పంపుతున్న చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య

ఆదుకోవడం ఇలాగేనా?

- నిత్యావసర సరుకులు మాత్రమే పంపిణీ
- ప్రభుత్వం నుంచి కానరాని భరోసా
- పునరావాస కేంద్రాల్లో వరద బాధితుల ఆవేదన



గుడారంలో తలదాచుకుంటున్న వరద బాధితులు

కూనవరం/వీఆర్‌పురం: ఏజెన్సీ గ్రామాలకు చెందిన ముంపు బాధితుల వైపు రాష్ట్ర ప్రభుత్వం కన్నెత్తి చూడటం లేదు. ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించిన అధికారులు ప్రభుత్వం తరపున అరకొరగా నిత్యావసర సరుకులు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు. వారం రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు శబరి, గోదావరి నదులకు వరద పోటెత్తడంతో చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లోని పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఉభయ నదులు పొంగి ప్రవహిస్తుండడంతో ముంపు బారినపడిన గ్రామాల ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. కూనవరంలోని ఉదయభాస్కర్ కాలనీ, వీఆర్‌పురం మండలం శ్రీరామగిరి, చొక్కనపల్లి, జీడిగుప్ప, చింతరేగుపల్లి గ్రామాలకు చెందిన ముంపు బాధితులను పలకరించగా.. 'పాలకులెవరూ ఇటువైపు కన్నెత్తి చూడలేదు. అరకొరగా నిత్యావసర సరుకులు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులిపేసుకుంది. ఇది చాలా బాధాకరం' అని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల నుంచి పునరావాస కేంద్రంలో ముంపు బాధితులు తలదాచుకుంటున్నారు. బాధితులకు ప్రభుత్వం కిలో కందిపప్పు, మంచి నూనె ప్యాకెట్, కిలో దుంపలు, అరకిలో కూరగాయలు మాత్రమే ఇచ్చిందని వరద బాధితులు చెప్పారు. వారం రోజుల నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా వంట చేసుకునే అవకాశం లేకుండా పోయిందని వాపోయారు. పునరావాస కేంద్రాల్లో భోజనం వండి పెట్టాల్సి ఉన్నప్పటికీ అలా చేయక పోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం ఇప్పించి పంపించండి సార్

కలెక్టర్‌కు వరద బాధితుల వినతి



జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సమస్యలు తెలుపుకుంటున్న వరద బాధితులు

కూనవరం: పోలవరం పరిహారం ఇప్పించి ఇక్కడి నుంచి పంపించండి సార్ అంటూ పలువురు వరద బాధితులు కలెక్టర్ దినేష్‌కుమార్‌ను వేడుకున్నారు. పునరావాస కాలనీల్లో చేపట్టిన నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. అందులో భాగంగా మండల కేంద్రం కూనవరంలోని చౌకదుకాణంలో జరుగుతున్న పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం వీఆర్‌పురం మండలం వైపు వెళుతుండగా బ్రిడ్జి రోడ్‌లో పలువురు వరద బాధితులు కలెక్టర్‌ను కలిశారు. యేటేటా తప్పని వరద బాధలతో అన్నివిధాలా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.తాత్కాలిక సౌకర్యాలకంటే పరిహారం ఇచ్చి పంపిస్తేనే అన్ని విధాలుగా మేలు జరుగుతుందని సూచించారు.అలాగే కూనవరం-టేకులబోరు మధ్య బస్టాండ్ సెంటర్ నుంచి స్టేట్ బ్యాంక్ వరకు సుమారు 10 అడుగుల మేర రోడ్డును ఎత్తు చేస్తే గ్రామంలోకి 60 అడుగులుపైగా వరద నీరు వచ్చినా కోతుల గుట్ట పునరావాస కేంద్రానికి రహదారి మార్గం ఉంటుందని బాధితులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

రహదారులపైనే వరద నీరు

కూనవరం: శబరి, గోదావరి నదులు శాంతించినా.. వాగులు వంకల నీరు ప్రధాన రహదారులపై బుధవారం కూడా నిలిచిపోయింది. దీంతో రాకపోకలు సమస్య కొనసాగింది. కూనవరం -భద్రాచలం రహదారిలో పోలిపాక వద్ద, కూనవరం -చింతూరు మధ్య పంద్రాజ్‌పల్లి వద్ద రహదారులపై వరదనీరు గురువారం ఉదయం తొలిగే సూచనలు కనిపిస్తున్నాయి.



శ్రీరామగుట్టపై గుడారాల్లో తలదాచుకుంటున్న వరద బాధితులు

వరద నష్టంపై పూర్తి సమాచారం సేకరించండి

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

చింతూరు: వరదముంపునకు గురైన గ్రామాల్లో జరిగిన నష్టాలపై పూర్తిస్థాయిలో సమాచారం సేకరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 25 నాటికి ప్రణాళికాబద్ధంగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని, రవాణా సౌకర్యం కలిగిన అన్ని గ్రామాలకు నిత్యావసర సరకులు చేరవేయాలని ఆదేశించారు. బాధితులకు పంపిణీ చేసేందుకు కాకినాడ, విశాఖపట్నం నుంచి దోమతెరలు సేకరిస్తున్నామని, అలాగే పదివేల లీటర్ల పాల ప్యాకెట్లను కూడా రప్పిస్తున్నామని ఆయన తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని, ప్రతి ఇంటికీ క్లోరిన్ మాత్రలు పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు. నిత్యావసరాలు, డీజిల్, కిరోసిన్ దుర్వినియోగం కాకుండా అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో జ్వరాలు నమోదవుతున్నందున వైద్యసిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, అవసరమైన ప్రాంతాల్లో జనరేటర్లు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవోలు సూరజ్ ధనుంజయ్ గనోరే, కావూరి చైతన్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

రాజవొమ్మంగి: సీజీఆర్ఎఫ్ / ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో రంపచోడవరం రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారుల పరిష్కారవేదిక ఏర్పాటు చేసినట్లు స్థానిక ట్రాన్స్‌కో ఏఈ చిన్నబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డా. బి.సత్యనారాయణ, సభ్యులు శ్రీనివాస్, జనార్దనరావు, సురేంద్రకుమార్ తదితరులు హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లొద్దు



బెంగాలీలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శివకుమార్

మోతుగూడెం: ప్రస్తుత పరిస్థితుల్లో సీలేరు నదిలోకి చేపల వేటకు ఎవ్వరూ వెళ్లవద్దని డొంకరాయి ఎస్‌ఐ శివకుమార్ ఆదేశించారు. ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్ర కుమార్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మూడు బెంగాలీ క్యాంప్ గ్రామాలను సందర్శించారు. సీలేరు నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున చేపల వేటకు వెళ్లొద్దని జాలర్లకు సూచించారు. మోతుగూడెం ఎస్‌ఐ గోపాల్‌రావు కూడా పొల్లూరు, కొత్త పల్లి, మోతుగూడెం రేవుల్లో నాటు పడవలు నడపకూడదని హెచ్చరించారు. డొంకరాయి రిజర్వాయర్ గేట్లు ఎత్తేందుకు ఏర్పాటు చేస్తున్నారని ఈ మూడు గ్రామాల్లో ఉన్న బెంగాలీలు చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు.

సీలేరు కాంప్లెక్స్‌లో నిరంతరాయంగా విద్యుదుత్పత్తి

చీఫ్ ఇంజినీర్ వాసుదేవరావు



సీలేరు: సీలేరు కాంప్లెక్స్‌లో నిరంతరాయంగా విద్యుదుత్పత్తి జరుగుతోందని ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీరు వాసుదేవరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఒకపక్క వర్షాలు పడుతుండటంతో లోడ్‌డిస్పాచ్ సెంటర్ ఆదేశాల మేరకు నిరంతరాయంగా విద్యుదుత్పత్తి జరుగుతోందన్నారు. కాంప్లెక్స్‌లో 5 నుంచి 6 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి జరుగుతుందని, డొంకరాయిలో కూడా ఉత్పత్తి ప్రారంభించామని చెప్పారు. ఇక సీలేరులో మొదటి యూనిట్‌ను ఈ నెలాఖరుకు వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. సీలేరు కాంప్లెక్స్‌లో జలాశయాల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సుమారు 20 టీఎంసీలు నీటి నిల్వలు చేరి ఉంటాయని ఆయన పేర్కొన్నారు.ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయానికి ఆశాజనకంగా నీటి నిల్వలు చేరాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదస్థాయికి 'డొంకరాయి' నీటిమట్టం

- గేట్లు ఎత్తి నీటి విడుదలకు జెన్‌కో కసరత్తు
- దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు



పూర్తిస్థాయి నీటి మట్టంతో డొంకరాయి జలాశయం

మోతుగూడెం: లోయర్ సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయ నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరుకుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,037 అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1,035 అడుగులకు చేరుకుంది. దీంతో అప్రమత్తమైన జెన్‌కో అధికారులు రాత్రికి ఏ సమయంలోనైనా జలాశయం గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేసేందుకు కసరత్తు మొదలుపెట్టారు.

అప్రమత్తం చేసిన అధికారులు

ప్రాజెక్టుకు సమీపంలోని డొంకరాయి, సింధువాడ, శాంతినగర్, మోతుగూడెం పంచాయతీ పరిధిలో ఒడియా క్యాంపు, ఇంతలూరు వాగు, ఫోర్ బేక్యాంప్, పొల్లూరు, మోతుగూడెం, చింతూరు దిగువ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నదిలో దుస్తులు ఉతికేందుకు, పశువులు కాసేందుకు వెళ్లవద్దని జెన్‌కో అధికారులు సూచించారు. అదేవిధంగా ఫోర్‌బై , డొంకరాయి రిజర్వాయర్లో బెంగాలీలు చేపలు పట్టకుండా చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు. జలాశయం గేట్లు ఎత్తి నీటిని విడుదల సమాచారాన్ని ముందుగానే చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి, ఇతర ప్రభుత్వ శాఖలకు సమాచారం అందించామని జెన్‌కో అధికారులు తెలిపారు.

నాటు పడవలు నడపొద్దు

పొల్లూరు, మోతుగూడెం, కొత్తపల్లి గ్రామ ప్రజలు రోజూ నాటు పడవలపై ఒడిశా రాష్ట్రానికి ప్రయాణం సాగిస్తూ ఉంటారు. గతంలో బొడ్డుగండి పంచాయతీ పరిధిలోని మంగంపాడు వద్ద నాటు పడవలపై ప్రయాణం చేసి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు పొల్లూరు, కొత్తపల్లి, మోతుగూడెం రేవుల్లో నాటు పడవలు నడపకూడదని అప్రమత్తం చేశారు.

డుడుమ సొగసు చూడతరమా!







దట్టమైన అటవీ ప్రాంతాన్ని తాకుతూ కనువిందు చేస్తున్న మంచు సోయగాలు.. మరోపక్క ఎత్తయిన కొండలపై నుంచి డుడుమ జలపాతం పరవళ్లు.. ప్రకృతి ప్రేమికులను మైమరిపిస్తున్నాయి. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వరదనీటితో జలపాతం పరుగులు పెడుతోంది. పచ్చని కొండల మధ్య ఈ అపురూప దృశ్యాలు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఈ అందాలను తిలకించేందుకు సందర్శకులు తరలివస్తున్నారు.

– ముంచంగిపుట్టు

క్లుప్తంగా

ఆయుర్వేద వైద్యుడి ఔదార్యం

- అల్పాహారం, భోజనం సరఫరా

చింతూరు: వరదల వేళ స్థానిక ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. వరదనీరు రహదారులపైకి చేరడంతో ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణకు చెందిన వాహనాలు మండలంలోని చట్టిలో నిలిచిపోయాయి. వాహనాల సిబ్బంది ఆకలితో అలమటిస్తుండటాన్ని గమనించిన ఆయన తన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో చింతూరు సీఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐ శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు రియాజ్, అజీజ్, అబ్రార్, షాజహాన్, మహబూబ్‌పాషా పాల్గొన్నారు.

రక్తహీనతతో విద్యార్థి మృతి

డుంబ్రిగుడ/అరకులోయ టౌన్: మండలంలోని దేముడువలస గిరిజన సంక్షేమ ఉన్నత బాలుర పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న లాజరస్ (12) అనే విద్యార్థి బుధవారం అరకు ఏరియా ఆస్పత్రిలోని చికిత్సపొందుతూ మృతిచెందాడు.

గతకొద్దిరోజులుగా రక్తహీనతతో బాధపడుతూ ఇంటివద్దనే ఉన్నాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో అరకు ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మన్యంలో వివిధ పాఠశాలలు, విద్యాలయాల్లో రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఐటీడీఏ ప్రత్యేక చొరవచూపాలని సీపీఎం నాయకులు రామారావు కోరారు. వారికి అవసరమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

'అల్లూరి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలి'

నర్సీపట్నం: కవర్ట్, హైటర్ల సమాధులస్థలాన్ని అల్లూరి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి లేఖ రాసినట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు బుధవారం మీడియాకు తెలిపారు. దామనపల్లి ఘాట్‌లో అల్లూరి సేనలకు, బ్రిటీష్ సేనలకు మధ్య జరిగిన భీకర పోరులో బ్రిటీష్ సైనికాధికారులైన కవర్ట్, హైటర్ మరణించారన్నారు. అల్లూరి చరిత్రకు నర్సీపట్నంలో బ్రిటీష్ సైనికాధిరుల సమాధులే సాక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు వెల్లడించారు.

10,707 మంది డ్రాపౌట్ల గుర్తింపు



రాజవొమ్మంగిలోని ఓ ప్రైవేట్ స్కూల్ పరిసరాలను పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు



రంపచోడవరంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

డీఈవో బ్రహ్మాజీరావు వెల్లడి

కొయ్యూరు: జిల్లాలో 10,707 మంది బడిబయట పిల్లలు (డ్రాపౌట్)ను గుర్తించామని డీఈవో బ్రహ్మాజీరావు వెల్లడించారు. బుధవారం ఆయన స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరిని కూడా బడుల్లో చేర్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. జిల్లాలో పాఠశాలలు లేని 62 గ్రామాలను గుర్తించామన్నారు. దీనిలో భాగంగా అక్కడ నాన్ రెసిడెన్షియల్ స్కూల్ టీచర్ సెంటర్(ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ)లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించామని తెలిపారు. వచ్చేనెలలో మంజూరు అయ్యే అవకాశం ఉందన్నారు. మంజూరైన వెంటనే వలంటీర్ల ద్వారా బోధన చేయిస్తామని తెలిపారు. రేవళ్లలో పాఠశాల ఏర్పాటు చేస్తామని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా ఆ గ్రామంలో గతంలో నిర్వహించిన పాఠశాలను ఆయన పరిశీలించారు. ఇది మునుపటి ఎయిడెడ్ పాఠవాల కావడంతో మేనేజ్‌మెంట్ నుంచి అనుమతి ఉండాలన్నారు. లేకుంటే గ్రామస్తులు మరోచోట వసతి కల్పిస్తే వెంటనే ఉపాధ్యాయులను పంపిస్తామని చెప్పారు. ఎయిడెడ్ యాజమాన్యంతో మాట్లాడి పాఠశాల ఏర్పాటు చేస్తామన్నారు.ఎంఈవో ఎల్. రాంబాబు పాల్గొన్నారు.

అన్ని సౌకర్యాలు ఉంటేనే అనుమతి

రాజవొమ్మంగి: పిల్లలు ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువుకునేందుకు వీలుగా అన్ని సదుపాయాలు ఉంటేనే ప్రయివేటు స్కూళ్లకు గుర్తింపు ఇస్తామని డీఈవో బ్రహ్మాజీరావు తెలిపారు. బుధవారం ఆయన మండలకేంద్రం రాజవొమ్మంగిలో నూతనంగా ఏర్పాటు చేసిన సెయింట్‌మెరీస్ పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రతి పాఠశాలలో నూటికి నూరు శాతం పిల్లలు బడిలోనే ఉండాలని అధికారులకు సూచించారు. స్థానిక విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించిన ఆయన యూడైస్ అప్‌డేషన్‌పై ఎంఈవో సూరయ్య రెడ్డి, హెచ్‌ఎంలు, ఇతర ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2,982 పాఠశాలలు వుండగా లక్ష్యం మేరకు 1,84, 444 మంది పిల్లలు బడిలో ఉండాలన్నారు. అయితే ఇప్పటివరకు 1,73,737 మంది పిల్లలు ఎన్‌రోల్ అయ్యారన్నారు. మిగతా వారిని చేర్పించేలా మండల స్థాయి అధికారులు, హెచ్‌ఎంలకు ఆదేశాలిచ్చామని తెలిపారు. ఆయన వెంట సీసీ విశ్వనాథం, సీఆర్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రంపచోడవరం: టీచ్ టూల్ ట్రెన్సింగ్ ద్వారా నేర్చుకున్న అంశాలు వలన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనమని డీఈఓ పి.బ్రహ్మాజీరావు అన్నారు. రంపచోడవరం ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న క్లాస్ రూమ్ అబ్జర్వర్స్ బేస్డ్ ఆన్ టీచ్ టూల్ ట్రెనింగ్‌ను బుధవారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఈ శిక్షణ వలన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కలిగే విద్యా సంబంధమైన ప్రజయోజనాలను, ఉపయోగాలను వివరించారు. ఏజెన్సీ డీఈఓ వై.మల్లేశ్వరరావు మాట్లాడుతూ రంపచోడవరం సెంటర్‌లో 74 మంది ఉపాధ్యాయులు ఆరు రోజులుగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. ఎంఈవో ఎం.రామకృష్ణ శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. తొమ్మిది రోజులు పాటు శిక్షణ ఉంటుందన్నారు.

పంట తెగుళ్లపై అప్రమత్తత అవసరం

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: తాజా వర్షాలకు నారుమడిలో నిలిచిన నీటిని వీలైనంత వేగంగా తొలగించి, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్ఏఆర్ఎస్) ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు సూచించారు.

పట్టణంలోని తమ కార్యాలయంలో బుధవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి పంటకు సోకే తెగుళ్ల నివారణలో అప్రమత్తంగా ఉండాలని, సస్య రక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో జింక్ లోపం తలెత్తే అవకాశం ఉన్నందున, దాని నివారణకు లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. నారుమడిలో పాడ తెగులు రాకుండా హెక్సాకొనజోల్ 2 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. వరిలో వర్షాల కారణంగా కలుపు సమస్య పెరగకుండా పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్‌ను ఎకరానికి 80–100 గ్రాముల చొప్పున 20–25 కిలోల పొడి ఇసుకలో కలిపి విత్తిన 4 నుంచి 7 రోజులలో వేసుకోవాలన్నారు. తేమను ఉపయోగించుకుని 10 రోజుల వయసు ఉన్న వరి నారుమడిలో కార్బోఫ్యూరాన్ గుళికలను సెంటుకు 150 గ్రా.ల చొప్పున చల్లుకోవాలన్నారు.

రాగులు పంటలో అగ్గి తెగులు ఆశించే అవకాశం ఉన్నందున కార్బెండిజం 1 గ్రాము, లేదా ట్రైసైక్లోజోన్ 0.5గ్రాము మందును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. రాగల వర్షాన్ని వినియోగించుకుని చోడి(రాగి)ని నాటుకునే రైతులకు ప్రత్యేక సూచనలిచ్చారు. స్వల్ప కాలిక రకాలైతే 10–15 సెం.మీ. దూరం, మధ్య కాలిక రకాలను 15–20 సెం.మీ. దూరంలో నాటుకోవాలన్నారు. రాగులు సాగు చేసేవారు ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువును వేసి ఆఖరి దుక్కిలో కలియుదున్నాలన్నారు. ఎకరాకు 26 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్, 13 కిలోల పొటాష్‌ను విత్తునాటే సమయంలో వేసుకోవాలని సూచించారు.

కలెక్టర్ దృష్టికి గ్రామాల సమస్యలు

వీఆర్ పురం: వరదల సమయంలో మండలంలో కూనవరం ప్రాంతం నుంచి వచ్చే విద్యుత్ లైన్‌లు నీట మునగడంతో సరఫరా నిలిచిపోయిందని గ్రామాలు అంధకారంలో ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, నాయకుడు మాచర్ల గంగులు వినతిలో పేర్కొన్నారు. ముంపు ప్రాంత పరిశీలనకు వచ్చిన కలెక్టర్ దినేష్‌కుమార్‌ను వారు కలిసి మండలంలో నెలకొన్న పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఇందులో భాగంగా వీఆర్ పురం మండలానికి ప్రత్యామ్నాయ లైన్ ఏర్పాటు ఏర్పాటు చేయాలని కోరారు. పెదమట్టపల్లి మీదుగా చింతూరుకు ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కామవుతుందని చెప్పారు. వరద బాధితులకు నిత్యావసర సరకులు, కూరగాయలు, టార్పాలిన్లు అందజేయాలని వినతిలో కోరారు. వడ్డిగూడెం సర్పంచ్ సోడే నర్సమ్మ, ఉప సర్పంచ్ కోట్ల శ్రీను, చినమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ కార్యదర్శి బొడ్డు సత్యనారాయణ, మండల పార్టీ ఉపాధ్యక్షులు చిక్కాల బాలు, నాయకులు గౌతమ్, జయరాజు, కాంతారావు బాలాజీ, వెంగలరావు, జైరాజు, నరేష్, ముత్యాలరావు తదితరులున్నారు.

కూనవరం : ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదని, వరద బాధితులకు సహాయక చర్యలకు సంబంధించి అధికారులు సమాచారం ఇవ్వడం లేదని జగ్గవరం సర్పంచ్ కారం పార్వతి, వడ్డిగూడెం సర్పంచ్ సోడె నరసమ్మలు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సమస్య పరిష్కరిస్తానన్నారు.

అదృశ్యమైన విద్యార్థుల అప్పగింత

తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు, బంధువులు

అడ్డతీగల: మండలంలోని డి.భీమవరం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు మంగళవారం సాయంత్రం భోజన సమయంలో పాఠశాల నుంచి అదృశ్యమయ్యారు. ఈ సంగతి తెలుసుకున్న తల్లిదండ్రులు, పోలీసులు రాత్రంతా విస్తృతంగా గాలించగా, బంధువుల ఇంట వారి ఆచూకీ కనుగొని బుధవారం ఉదయం తల్లిదండ్రులకు అప్పగించడంతో ఉత్కంఠకు తెరపడింది. ఓ పక్క భారీ వర్షాలు ఉధృతంగా ప్రవహిస్తున్న కొండవాగులు వెరసి విద్యార్థుల కుటుంబీకులు ఆందోళన చెందారు.అడ్డతీగల మండలం పాతపాడుకి చెందిన ముర్ల లక్ష్మారెడ్డి, ముర్ల రామిరెడ్డి డి.భీమవరం ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుకుంటున్నారు. మంగళవారం సాయంత్రం భోజనాలు చేసే సమయంలో పాఠశాల నుంచి పరారయ్యారు. ఉపాధ్యాయులకు ఈ విషయం తెలియలేదు. సహచర విద్యార్థుల ద్వారా ఈ విషయం తల్లిదండ్రులకు సమాచారం అందడంతో వారితో పాటు వారి బంధువులు, పోలీసులు విస్తృతంగా గాలిస్తుండగా డొక్కపాలెం కొండకాలువ చెంతనే విద్యార్థుల చెప్పులు దొరికాయి.



పాఠశాల నుంచి అదృశ్యమైన విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

వాటిని తీసుకున్న తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర ఆందోళన చెందుతూ విద్యార్థుల ఆచూకీ కోసం వెతకసాగారు. అయితే బుధవారం ఉదయం డొక్కపాలెంలోని బంధువుల ఇంట్లో విద్యార్థులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పాఠశాల నుంచి విద్యార్థులు ఎందుకు వెళ్లారో పలు మార్లు వారిని ప్రశ్నించినా సమాధానం చెప్పలేదని కుటుంబ సభ్యులు తెలిపరాఉ. ఉపాధ్యాయులు ఇంటికొచ్చి ఇద్దరు విద్యార్థులను తిరిగి పాఠశాలకు తీసుకొని వెళ్లారు. దీంతో తీవ్ర ఉత్కంఠకు తెరపడింది.

చింతపల్లి-కొయ్యూరు రాకపోకల పునరుద్ధరణకు చర్యలు

నల్లగొండ వద్ద తాత్కాలిక కాజ్‌వే ఏర్పాటు

కొయ్యూరు: ఐదు రోజులుగా నిలిచిపోయిన చింతపల్లి–కొయ్యూరు రాకపోకలను పునరుద్ధరించేందుకు జాతీయ రహదారి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పెదమాకవరం–నల్లగొండ మధ్య కొట్టుకుపోయిన కాజ్‌వేను కొంత వరకు పునరుద్ధరించారు. దీనిపై నుంచి ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు, ఆటోలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెనలపై తూరులు పెద్దవి వేసి సిమెంట్‌తో పూడిస్తే నీరుపై నుంచి పోయి ఉండేదని, అందుకు బదులుగా మట్టి వేయడంతో నీటిలో కొట్టుకుపోతుందని చెబుతున్నారు. రామరాజుపాలెం–పెదమాకవరం మధ్య ఉన్న కల్వర్టు పూర్తిగా పాడైపోవడంతో మరమ్మతు పనులు చేస్తున్నారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రెండు మండలాల మధ్య రాకపోకలు స్తంభించడంతో మంప-



నల్లగొండ-పెదమాకవరం వద్ద కోతకు గురైన కాజ్‌వే

పాడేరు, పాడేరు–రంపచోడవరం బస్సులు నిలిచిపోయాయి. చింతపల్లి వెళ్లాల్సిన వారంతా నర్సీపట్నం మీదుగా ప్రయాణిస్తున్నారు. రహదారులు అధ్వానంగా, కాజ్‌వేలు పాడైనా జాతీయ రహదారి అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని పలువురు చెబుతున్నారు.

హక్కులు, చట్టాలపై అవగాహన అవసరం

స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

పెదబయలు: ఆడ పిల్లలకు కల్పించిన హక్కులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు రాజ్యాంగం ద్వారా కల్పించబడిన హక్కులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అన్ని రంగాల్లో ఆడ పిల్లలు రాణించాలని, ఉన్నత విద్యకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. సమాజంలో ఆడ పిల్లలపై జరుగుతున్న నేరాలపై కూడ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. బాలికల పాఠశాలల్లో 100 రోజుల ప్రోగ్రాంపై అవగాహన కల్పించారు. ఆడ పిల్లల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రం–1ను సందర్శించారు. భవనం శిథిలావస్థకు చేరుకుందని పిల్లలకు



కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పీడీ సూర్యలక్ష్మి

ప్రీ స్కూల్ నిర్వహణ ఇబ్బందిగా ఉందని అంగన్‌వాడీ కార్యకర్త పీడీ దృష్టికి తెలిపారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వచ్చే పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు జరిగే అన్ని కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులు, బాలింతలకు ఫీడింగ్, వ్యాధి నిరోధక టీకాలు అందించే కార్యక్రమాలు క్రమం తప్పకుండా జరగాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్, పోలీసు సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

గొలుగొండ: రెండు కిలోల గంజాయి బ్యాగ్‌తో పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్లు గొలుగొండ ఎస్‌ఐ బి.కృష్ణారావు తెలిపారు. వివరాలివి. ఏటిగైరంపేట చెక్‌పోస్టు సమీపంలో బుధవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రావికమతం మండలం, అజ్జాపురానికి చెందిన మైనర్ బాలుడు బ్యాగ్‌తో అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో బ్యాగ్‌ను తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయిని గుర్తించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి, కోర్టుకు అప్పగించామన్నారు.

'పెట్రోలియం' పనులు పరుగులు



చురుగ్గా క్యాంపస్ నిర్మాణ పనులు

- వచ్చే విద్యా సంవత్సరానికి ఐఐపీఈకి శాశ్వత భవనాలు
- సబ్బవరం మండలం వంగలిలో రూ.655.46 కోట్లతో సాగుతున్న పనులు
- 200 ఎకరాల విస్తీర్ణంలో పర్యావరణహిత భవనాలు

ఐఐపీఈ కొత్త క్యాంపస్ విస్తీర్ణం **201.80** ఎకరాలు
భవనాల విస్తీర్ణం **65,000** చ.మీటర్లు
మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.**655.46** కోట్లు
మొత్తం ఎన్ని దశల్లో నిర్మాణం **2** దశల్లో
తొలి దశలో **950** మంది విద్యార్థులకు అనుగుణంగా నిర్మాణాలు
మొదటి దశ పూర్తయ్యేది **2025** జూన్‌లో
మొత్తం ఎన్ని విభాగాల భవనాలు **11**
డిజైన్లు తయారు చేసిన సంస్థ ముంబైకి చెందిన ఆర్కిటెక్చరల్ సంస్థ
కాంట్రాక్టు- సీపీడబ్ల్యూడీ ఆధ్వర్యంలో కేపీసీ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ

సాక్షి, విశాఖపట్నం: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూ ఇబ్బందులను తొలగించిన తర్వాత పనులు జోరందుకున్నాయి. 2016 నుంచి ఏయూలోని ఇంజినీరింగ్ కాలేజీలో తరగతులు నిర్వహిస్తున్నారు. శాశ్వత భవన నిర్మాణానికి అదే సంవత్సరం అక్టోబర్‌లో శంకుస్థాపన చేసినా భూ అడ్డంకులతో నిలిచిపోయాయి. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో భూ కేటాయింపు సమస్యలు పరిష్కారమయ్యాయి. 200 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రూ.655.46 కోట్లతో చేపడుతున్న క్యాంపస్‌లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు.

పరిశోధనలు పెంచాలనే లక్ష్యంతో..

ఉమ్మడి విశాఖ జిల్లాలో హెచ్‌పీసీఎల్‌తో పాటు నక్కపల్లి, రాంబిల్లి పారిశ్రామిక క్లస్టర్లు కీలకమైనవి. సమీపంలోనే ఉన్న కృష్ణా గోదావరి పరివాహక ప్రాంతం (కేజీ బేసిన్)లో అపారమైన చమురు, సహజవాయువు నిల్వలున్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రంగంలో నిపుణులు, నైపుణ్యమున్న సిబ్బంది కొరత ఉంది. ఈ లోటును పూడ్చడంతో పాటు చమురు, ఇంధన రంగ అభివృద్ధికి అవసరమైన పరిశోధనలు పెంచాలనే లక్ష్యంతో విశాఖలో ఐఐపీఈ ఏర్పాటుకు విభజన చట్టంలో భాగంగా కేంద్రం మొగ్గు చూపింది. కేంద్ర చమురు, సహజవాయువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పూర్తి స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే ఈ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రభుత్వ రంగ సంస్థలైన హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్, ఓఎన్‌జీసీ, గెయిల్, ఐఓఎల్ సహకారం అందిస్తుంటాయి. ఏయూలో ఐఐపీఈ తాత్కాలిక క్యాంపస్ 2016లో ఏర్పాటు చేశారు.



ఐఐపీఈ నూతన క్యాంపస్ నిర్మాణ డిజైన్‌లు

చురుగ్గా సాగుతున్న పనులు

శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులకు సంబంధించిన ప్రాజెక్టుకు సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీగా వ్యవహరిస్తోంది. కేపీసీ ప్రాజెక్ట్సు లిమిటెడ్ సంస్థకు కాంట్రాక్టు బాధ్యతలు అప్పగించారు. 2022లో శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈస్టర్న్ అకాడమీ బ్లాక్, మూడు హాస్టల్ బ్లాక్‌లు, మెస్ బ్లాక్, 8 విభాగాలకు సంబంధించిన క్వార్టర్స్, గెస్ట్ హౌస్, డైరెక్టర్ రెసిడెన్సీ, ఓవర్‌హెడ్ ట్యాంక్ మొదలైన భవనాల నిర్మాణ పనులు



జోరందుకున్నాయి. వచ్చే ఏడాది జనవరి నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి.. జూన్‌కల్లా క్యాంపస్ సమగ్రంగా సిద్ధం చెయ్యాలని అధికారులు భావిస్తున్నారు. అందుకనుగుణంగానే పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో..

ఐఐపీఈ శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి సబ్బవరం మండలంలోని వంగలి గ్రామ పరిధిలో సర్వే నంబరు 135/2లో 147.58 ఎకరాలు, 241/3లో 54.22 ఎకరాలు చొప్పున మొత్తం 201.80 ఎకరాల్ని కేటాయించారు. ఇందులో కొంతమేర డీ పట్టా భూములుండగా.. కొందరు రైతులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. వీరిలో 19 మంది రైతులు 20.08 ఎకరాలకు సంబంధించి పరిహారం విషయమై కోర్టును ఆశ్రయించారు. నిర్ణీత సమయంలో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చెయ్యకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉన్నా.. ఈ వివాదాలను పరిష్కరించడంలో గత టీడీపీ ప్రభుత్వం అశ్రద్ధ వహించింది. దీంతో భూమి స్వాధీన ప్రక్రియ పెండింగ్‌లో ఉండిపోవడంతో పనులు నిలిచిపోయాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిపై దృష్టిసారించి.. స్థానిక రైతుల డిమాండ్‌లకు అంగీకరించింది. దీంతో క్యాంపస్ నిర్మాణ పనులకు మార్గం సుగమమైంది.

హరిత భవనాలు నిర్మిస్తున్నాం



నూతన క్యాంపస్ నిర్మాణ పనులు సీపీడబ్ల్యూడీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, ఈస్ట్రన్ అకడమిక్ బ్లాక్, బాయ్స్ హాస్టల్, డైనింగ్ మొదలైన 11 భవనాల నిర్మాణ పనులు పూర్తవుతున్నాయి. మొదటి దశ నిర్మాణ పనులు 2025కు పూర్తవుతాయని భావిస్తున్నాం. ఇప్పటికే శాశ్వత ప్రాంగణం చుట్టూ ఏపీఐఐసీ సహకారంతో ప్రహరీ నిర్మాణం పూర్తి చేశాం. వచ్చే ఏడాది తరగతులు కొత్త క్యాంపస్‌లో ప్రారంభించాలని ఆశిస్తున్నాం. మొత్తం భవనాలన్నీ హరిత భవనాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. గ్రీన్ బిల్డింగ్ పారామీటర్స్‌తో గ్రిహ రేటింగ్ (గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హ్యాబిటేట్ అసెస్‌మెంట్)తో ఇంధన సంరక్షణ బిల్డింగ్ కోడ్ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేస్తున్నాం. మొత్తం 65,000 చ.మీటర్ల విస్తీర్ణంలో భవనాలు నిర్మితమవుతున్నాయి.

– ప్రొ.శాలివాహన్, ఐఐపీఈ డైరెక్టర్